# పూలమ్మిన చోటనే...

ఆ హాలంతా పకపక నవ్వులతో గలగలమని మోగిపోతోంది. ఒకరి మీద ఒకరు స్వేచ్ఛగా జోక్స్ వేసుకుంటున్నారు. అవెంత ఘాటుగా వున్నా తేలికగా తీసుకుని నవ్వేసుకుంటున్నారు.

అక్కడ చేరిన వారందరు పేరుమోసిన ఓ పెద్ద సంస్థలో పనిచేస్తున్న సీనియర్ ఆఫీసర్లు. కొంచెం అటూ యిటూ తేడాలు వున్నా అందరూ సరి సమానమైన హోదా గలవారే.

అందరికంటే ఒక మెట్టు పైస్థాయిలో వున్న గురుప్రసాద్ కూడా వున్నాడు. అతనికి తన కింద ఆఫీసర్లతో కలిసి మెలిసి తిరుగుతూ భేషజం లేకుండా వుండటం అలవాటు. అందుకే అతని దగ్గర కొచ్చి సలహాలు, సంప్రదింపులు చేస్తుంటారు అంతా.

అక్కడ సమావేశమైన సగంమందికి ఆ పార్టీ నిరుత్సాహంగా అనిపించడానికి కారణం. అది మందు పార్టీ కాకపోవడమే. మటనూ, మందూ వద్దనుకునే మహాత్ములెవరూ లేరక్కడ, కానీ ఊహించని విధంగా ఈ పార్టీ యింత చప్పగా మారడానికి ఓ కారణం వుంది.

అదేమంటే ప్రసన్న అనే ఒక కుర్ర ఆఫీసరు ఎంతో ఆలోచించి, శ్రమపడి ఈ పార్టీకి ఏర్పాట్లు చేశాడు. మొదట్లో అందరూ మొరాయించారు. మందు లేకపోతే మజా ఏముంటుందీ అని చప్పరించారు. కానీ అతను పట్టువదలకుండా, ఒక్కొక్కరినీ విడివిడిగా కలుసుకుని నచ్చచెప్పి ఒప్పించాడు. అతనంత కష్టపడ్డానికి కారణమేమై వుంటుందీ అంటే అతనేదో మహానుభావుడని కాదుగానీ మహా భయస్తుడు. అతని భయానికి కారణం లేకపోలేదు. మూడు నెలల క్రితం ఇలాగే ఓ పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కొక్కరూ పీకలదాకా తాగి తాగి, నానా బూతులూ ఒకర్నొకరు తిట్టుకుని, కడుపుల్లో వున్న ఈర్ష్యా అసూయల్ని వెళ్ళగక్కుకుని ఒకర్నొకరు తన్నుకునే పర్యంతం అయ్యారు. అయితే మళ్ళీ మర్నాడు ఒకరి ముఖం ఒకరు చూసుకోవాలి కదా! ఒకరితో ఒకరికి పను

లుంటాయి కదా ! మొహమాటాలుంటాయి కదా ! అవన్నీ గుర్తించి అందరూ ఒక్కసారి సిగ్గుపడ్డారు. మూడు నెల్లు గడిచేసరికి సిగ్గు తెరలు తొలగి మళ్ళీ మామూలయ్యారు. కానీ ప్రసన్నకి ఆ భయంకర వాతావరణం బాగా గుర్తుండి పోయింది. అందుకే అందరికీ విడివిడిగా నచ్చచెప్పి ఈ పార్టీ ఏర్పాటుచేశాడు. చిత్రమేమంటే అందరూ ఎదురుగా వున్నప్పుడు ఒకరిపట్ల మరొకరు విపరీతమైన ప్రేమాభిమానాలు, గౌరవ మర్యాదలూ ప్రదర్శిస్తారుగానీ, పక్కకి తిరిగిన వెంటనే ఒకరంటే ఒకరికి పడదు. వాడికి ఎ. బి. సి (A, B, C) రాదని వీడంటే వీడుట్టి వెధవని వాడంటాడు.

ఇంతకీ ఈ పార్టీ ఏర్పాటు చేసుకోవడానికి కారణం ఏమిటి ?

త్వరలో పెద్ద ఎత్తున బదిలీలు రాబోతున్నాయి. వాటి పూర్వాపరాలు చర్చించాలి. అందరికీ బిగ్‌బాస్ రిటైరయి వెళ్ళిపోయాడు. ఆయన స్థానంలో డిప్యూటేషన్‌మీద గవర్నమెంటు నుంచి ఎవరో వస్తారు. వారెవరూ ? ఆ వచ్చే కొత్త బాస్‌తో తామెలా వుండాలి ? అదీ చర్చ.

"గురూగారూ ! ఈసారి ప్రమోషన్స్‌లో ముగ్గురు లేడీస్ సెక్షన్ ఆఫీసర్లుగా రాబోతున్నారు" అన్నాడు ప్రసన్న.

ముకుందరావు ప్లేటులో జీడిపప్పు పకోడీ చేతిలోకి వంపేసుకుని నోట్లో పోసుకుని పరపరా నములుతూ "అయ్యా ! మీకు పుణ్యముంటుంది. ఆ ఆడంగుల్ని మాత్రం మాకు వేయకండి అన్నాడు.

"నిజమే గురూగారూ ! నన్నూ కరుణించండి. నా ఆఫీసులో వేస్తే నేనూ తట్టుకోలేను" అన్నాడు మార్కండేయులు.

"ఎవరూ వద్దంటే నేను వాళ్ళనెక్కడ పోస్టు చెయ్యనయ్యా అంటూ తల పట్టుకున్నాడు గురూ. గురూ అని పిలవబడే గురుప్రసాద్.

"ఏమో బాబూ ! నా ఆఫీసులో మాత్రం మగాళ్ళే కావాలి"

"ఏం ? ఎందుకని ?"

"ఎందుకంటే ఏం చెప్తామయ్యా ?"

"అదే చెప్పు. వర్క్ అవదని భయమా ?"

"అదేం కాదు. వర్క్ బాగానే అవుతుంది. ఓ మాటా మంతీ వుండదు. ఆఫీసు టైము అవుతుంటేనే యిళ్ళకి బయలుదేరి పోతారు. మనం భుజాల మీద చేతులేసుకుని తిరగడానికి కుదరదు" మార్కండేయులు తేల్చాడు.

ముకుందరావు అందుకున్నాడు.

"ఏదైనా చిన్న మాట వస్తే నెత్తిమీద నీళ్ళకుండ చిల్లు, ఇంట్లో పడు తున్నాంకదా- వద్దు-ఆఫీసులో వద్దు" అంటూ తలకాయ అటూయిటూ వూపేశాడు.

"మరి నన్నేం చెయ్యమంటారూ. మనం యింతవరకు అనుసరిస్తున్న విధానం ప్రకారం వాళ్ళని ఇక్కడే పోస్టు చెయ్యాలికదయ్యా."

"ఏంటయ్యా విధానం. ఉద్యోగాలు కావాలని వచ్చినవాళ్ళు ఎక్కడికైనా వెళ్ళాల్సిందే" మొరిగాడొకడు.

"బిగ్‌బాస్. అదే పోయినవాడు ఆడాళ్ళని అభిమానంగానే చూశాడు. ఆయన యిక్కడే వుంచమన్నాడు. ఇప్పుడా జమానా పోయిందిగా తోసెయ్ గురూ అందర్నీ తలో వైపుకీ తోసెయ్" అన్నాడు కసిగా కనకారావు.

ఈ కనకారావుకి ఆడవాళ్ళని చూస్తే పట్టలేని అసూయ. ప్రతీ లేడీక్లర్క్ దగ్గరకు వెళ్ళి

"మీకేముంది మీకు రెండు జీతాలు - ఒక జీతం బ్యాంక్ - ఒక జీతం ఖర్చులకి" అంటాడు.

ఎవరైనా మంచి చీర కట్టుకుంటే చాలు-సీటు సీటుకెళ్ళి "ఆవిడకేమయ్యా-, సంసార బాధ్యతలూ, బరువులూ వుండవు కదయ్యా, ఫస్టు తారీఖు జీతం తీసుకో వడం చీరలషాపుమీద పడటం" అంటుంటాడు. వీళ్ళకి కాస్త దూరంగా వున్న రాఘవ మాత్రం వీళ్ళ మాటలు విని ఇబ్బందిపడుతున్నాడు. అతని భార్య డాక్టర్ గవర్నమెంటు హాస్పటల్లో పనిచేస్తోంది. ఇంట్లో పిల్లల బాధ్యత భర్త బాధ్యత ఎంతో శ్రద్ధగా నిర్వహిస్తూ వుంటుంది. బయటకి ఉద్యోగం కోసం వచ్చిన స్త్రీ తన భార్యయినా, పరాయి స్త్రీ అయినా ఒకటే కదా! అందరికీ కొన్ని కష్టాలు వుంటాయి కదా! వీళ్లంతా ఇంతింత చదువులు చదువుకుని, పెద్ద పెద్ద హోదాల్లో ఉన్నా యిలా చులకనగా మాట్లాడ్డం అసహ్యంగా వుంది అనుకున్నాడతను.

అక్కడున్న వారిలో స్త్రీ పట్ల కాస్త సానుభూతి వున్నవాడు అతనొక్కడే.

అతను అక్కడున్న పేపరు తీసి చదవడం మొదలుపెట్టాడు. అతన్ని ఆకర్షించిన ఒక అయిటమ్ చూపిస్తూ "ఇదిగో స్త్రీల కోసం మహిళా యూనివర్శిటీ పెట్టాలని ఆలోచిస్తున్నార్ట - ఉద్యోగాల్లో ముప్పై శాతం రిజర్వేషన్ యివ్వాలని అంటున్నారు." అన్నాడు నెమ్మదిగా. "ఈ రాఘవ స్త్రీ జనోద్ధరణకి కంకణం కట్టుకున్నట్లున్నాడు" అన్నాడు ముకుందరావు వ్యంగ్యంగా.

"అయినా ఆడవాళ్ళకు ఉద్యోగాలెందుకయ్యా- ఇంటిదగ్గరుండి వంట చేస్తూ బట్ట లుతుక్కుంటూ, ఇల్లు సర్దుకుంటే చాలదూ" అన్నాడొక ముంగిస ముఖం మునిరాజు.

"వాళ్లు చిత్రంగా వుంటారు. ఆఫీసులకు ఉద్యోగాలకి వస్తారు గానీ, వారి ధ్యాసంతా యింటి మీదనే-ఎప్పుడు చూసినా పర్మిషను" యిస్తారా, లీవు యిస్తారా అని అడగడానికి సిద్ధంగా వుంటారు"అన్నాడు అప్పటిదాకా మౌనంగా కూర్చున్న రవికుమార్.

మార్కండేయులు అందుకున్నాడు.

"మా అబ్బాయి అరుగుమీంచి పడ్డాడండి శలవు కావాలి"

"మా మరిదికి ఇంటర్వ్యూ వుందండి-"

"మా అత్తగారికేం బాగోలేదండి"

"మా పిల్లకి ఫీజు కట్టాలండి" అని దండకం చదివి పూర్తి చేశాడు. ఒక్కొక్క వాక్యం అతను చదువుతుంటే అందరూ గొల్లుమని నవ్వడం-, కనకా రావు కసి ముఖంతో మొదలుపెట్టాడు ఇంకా చిత్రంగా వుంటాయి వారి మాటలు.

"అయ్యో! మేడమీద మిరపకాయలు ఎండబోసి వచ్చాను. మబ్బులు కమ్ముకొస్తున్నట్లున్నాయి కాస్త పర్మిషనిద్దురూ అంటారొకసారి. మా పినతల్లి కూతురు శ్రావణ మంగళవారం నోము నోచుకుంది. వాయినం తీసుకొచ్చేస్తాను పర్మిషనివ్వండి." అంటుందొక మహాయిల్లాలు.

ఈ కబుర్లు వింటూ అందరూ విరగబడి నవ్వుతున్నారు.

చివరిగా అందరూ ఒకే మాట-, ఈ లేడీ సూపర్‌వైజర్‌ని యిక్కడినుంచి బదిలీ చేసిపారేయండి గురూగారూ."

కనకారావు జేగురు ముఖంతో.

"నేను మాత్రం వాళ్ళెప్పుడు పర్మిషను అడిగినా, లీవు అడిగినా ఒక్కటే అంటాను. "మీ హస్బెండ్ ఏమయ్యారండి. ఆయన్ని చూసుకోమనండి" అని తెగేసి చెప్తాను. "అవునండి వాడు రెండు జీతాల సౌఖ్యం అనుభవించేవాడు బాధ్యతలు స్వీకరించలేడా"- అని గద్దించాడు.

అతని మాటల్లోని ఓర్వలేనితనం అందరికీ కొంత అర్థమయినా, పైకి అవు నవునని అతనికి వంత పాడారు.

సరిగ్గా అప్పుడే ఆ పార్టీ హాల్లోకి అడుగు పెట్టాడు అర్జున్-, అందరూ అతనివైపు ఆసక్తిగా చూశారు.

"ఎనీ న్యూస్ ? అన్నాడు గురుప్రసాద్-

"అవును సార్. బ్రహ్మాండమైన న్యూస్.

"ఏమిటి ?"

మనకి ఎ. జి. నుండి డిప్యూటేషన్ మీద ఫైనాన్షియల్ ఎడ్వయిజర్‌ని వేశారు.

"ఎవరు ?"

"ఒక లేడీని-"

"ఆ...." ముక్త కంఠాలు ఆశ్చర్యం.

"ఎవరామె ?"

పేరు సత్యభామట - మగవాళ్ళంటే పురుగుల్లా చూస్తుందట - ఎవరినైనా ఎంతమాటైనా అంటుందిట - ఎక్కడైనా, ఎందరిలో వున్నా నిలబెట్టి దులిపి పారేస్తుందట - చివరికి ఆమెతో మాట్లాడటానికి వెళ్తే కూర్చోమని కూడా అనకుండా మాట్లాడి పంపేయగలదట.

వార్త చెప్పిన అర్జున్, అలసిపోయి కూర్చున్నాడు. అందరూ అరవై సెకన్లు నిశ్శబ్దంగా వుండిపోయారు. అంతవరకూ ఉద్యోగినుల ఉనికి మీద విరుచుకుపడిన అందరూ ఒక్కసారి అయోమయంలో పడిపోయారు.

"ఏమయ్యా కనకారావు అందర్నీ తలోవైపుకి ట్రాన్స్‌ఫర్ చేసిపారేయమన్నావు ఆడవాళ్ళని-ఇప్పుడు మనలో ఎవరెక్కడికి పోతామో"- అన్నాడు ఏడుపు కంఠంతో ముకుందరావు.

"అందుకే ఇకనైనా ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి. అందరం స్త్రీలతో జీవితాలు ముడిపడి వున్నవాళ్ళమే పరాయి ఆడదానిని గురించి అవహేళన చేయడం అన్యాయం" అన్నాడు అవకాశం దొరికిన రాఘవ.

"సర్లేగానీ ఇప్పుడు పూలమ్మిన చోట కట్టెలమ్మాల్సి వస్తుందని బాధగా వుంది"-అన్నాడు గురుప్రసాద్.

"మగాళ్ళకంటే ఎప్పుడూ ఆడవాళ్ళు మంచివాళ్ళేలెండి. మీకా భయం అక్కరలేదు" అన్నాడు ముకుందరావుని, కనకారావు కసిగా చూస్తూ రాఘవ.

18-4-93—(విశాలాంధ్ర)